అనంతం

మధ్యాహ్నం ఒంటిగంట అయింది. ఆఫీసులో విరామ సమయం. సెక్షన్లో వాళ్ళంతా జట్లు జట్లుగా కాఫీలకంటూ వెళ్లిపోగా, అనంతంగారు ఒక్కరూ మిగిలిపోయేరు. ఆయన పూర్తిపేరు అనంత పద్మనాభస్వామి. కాని ఇంటా బయటా అంతా అనంతంగారంటారు. భార్య అన్నపూర్ణ ప్రతిరోజూ బలవంతాన ఇచ్చి పంపించే టిఫిన్ డబ్బా ఎదురుగా టేబిల్ పైనే ఉంది. 'ప్రతి విషయానికీ బాధపడి ఆరోగ్యం పాడుచేసుకోకండి...ఆరోగ్యం ఉంటే అన్నీ ఉన్నట్టే... మీ కిష్టమని ఇవ్వాళ బొబ్బట్లు చేసి పెట్టాను. తప్పకుండా తినండి...'

అనంతంగారు స్టీలుడబ్బావంక చూసి భార్యని తల్చుకుని జాలిగా నవ్వేరు.

అన్నపూర్ణ! వొట్టి పిచ్చిది...సుఖం తెలీని బతుకు. ఉదయం నించి రాత్రిదాకా యంత్రం లాగ తిరుగుతూ అందరికీ అన్నీ వేళ ప్రకారం అమర్చిపెట్టి అలిసి సొలసిపోయి తినీ, తినక కటిక నేల పైన పడుకుని నిద్రపోతుంది. తెల్లవారితే మళ్ళీ మొదలు. గత ముప్పయి ఏళ్ళుగా జరుగుతున్న కార్యక్రమం. ఎప్పుడన్నా తాను "పూర్ణా' ఆడవాళ్ళకి ఎన్నో కోర్కెలుంటాయంటారు. వాటిని తీర్చుకోటానికి మొగుళ్ళని అనేక విధాల రాపాడుతుంటారని విన్నాను. కాని నువు ఏనాడూ నాకిది కావాలని అడిగినట్టు నాకు గుర్తులేదు. కారణం!" అనడిగితే, ఆమె తన వంక కోపంగా చూసి. ఆప్యాయంగా నవ్వుతూ దానికి పెద్ద కారణం!' అంటూ ఏం వుంటుందడీ? మీరు పగలంతా ఆఫీసులో కష్టపడి పన్జేసి ఇంటికి తిరగొచ్చేసరికి మీకు ఏంకావాలో, మీ శరీరానికి, మనుసుకి విశ్రాంతి ఏ విధంగా కలగజేయాలో

ఆలోచనే తప్ప... నాకు అదేమిటో వేరే ఆలోచన రాదు. నెల తిరిగే సరికి జీతం మొత్తం తెచ్చి ఇంట్లోనే ఇస్తారు. మీకు చేడు అలవాట్లు ఏంలేవు. మనకి ఆధారం కేవలం మీ జీతమే అయినపుడు అర్థం లేని కోర్కెలు మనస్సులో కలిగించుకుని మిమ్మల్ని కష్ట పెట్టడం నాకిష్టం ఉండదు. ఎంచేతనోగాని మీరు బాధపడుతుంటేనే చూడలేనండీ" అంటుంది భుజానికి తల ఆనిస్తూ.

అనంతానికి దేవుడంటే పీకలదాకా కోపం ఉంది. కారణం తనని దురదృష్టవంతుడిగా పుట్టించాడని అభియోగం. కాని, భార్యని చూసినప్పుడల్లా విధాతపై తన కోసం కాస్త పటాపంచలయిపోతుంది. తనకి అన్నపూర్ణలాంటి భార్యనిచ్చేడు. తనకింకేం కావాలి? భగవంతుడు మనిషికి అన్నీ ఇచ్చినట్లే ఇచ్చి, ఏదో ఒకటి మాత్రం లోటు చేస్తాడట. ఎక్కడో చదివినట్లు గుర్తు. బహుశా తనంటే ప్రాణం పెట్టే భార్యని ఇచ్చినందువల్లనే సిరిసంపదలు తనకి దూరం చేశాడు. అంటే సిరి సంపదలు, హోదాలు ఇచ్చిన వాళ్ళకి..?ప్చ్.. పాపం వాళ్ళెంత దురదృష్టవంతులోగదా!

పాతకాలం చెక్కకుర్చీలో స్థిరనివాసం ఏర్పరచుకున్న ముసలి నల్లి నిద్రలేచి అనంతంగారి శరీరాన్ని చప్పరించి ఎంగిలిచేసింది. ఆలోచనల్లో ఉన్న ఆయన తెప్పరిల్లి, తన రక్తం పీల్చి జీవిస్తున్న ఆ నల్లిని కనులారా చూద్దామని కుర్చీంలోంచి లేచి పరీక్షగా చూసి, ఫలితం లేక తిరిగి కుర్చీలో ఆసీనుడవుతుండగా, కాఫీ కెళ్ళిన ఒక జట్టు తిరిగొచ్చింది. ఆ జట్టుకి ప్రకాశరావు నాయకుడు.

ప్రకాశరావుకి నలభై ఏళ్ళుంటాయి. ఆఫీసులో జరిగే సంగతులన్నీ తెల్సుకుని వచ్చి కథలు కథలుగా చెప్తుంటాడు. "పక్క సెక్షన్లో పారిజాతం. క్యాష్ సెక్షన్లో ఉన్న ప్రసాదరావుని పెళ్ళి చేసుకుంటోందిట" ఇలాంటి వ్యక్తిగతమైన సంగతులు దగ్గర్నించి రేపు ముగ్గురికి ఆఫీసర్ ప్రయోషన్లొస్తున్నాయి. ఫైలు జీయమ్మిగారి సంతకానికెళ్ళింది"–లాంటి అతి రహస్యపు సమాచారాన్ని గూడా పట్టుకురాగల సమర్దుడు..ఆరోజు వస్తూనే."అనంతంగారూ..ఇది విన్నారా? మొన్న వొళ్ళు కాల్చుకు చచ్చిపోయిన ప్రసూనాంబ..అదేనండి..నాగేశ్వరావు సెక్షన్లో స్టెనోగా ఉండేది...మొగుడు రోజూ తాగొస్తాడని, అతణ్ని బెదిరించటానికి వొళ్ళంతా కిర్సనాయిలు పోసుకుని, అంటించుకు హరీ మన్నది...ఆవిడ కొడుక్కి ఇక్కడ ఉద్యోగం ఇచ్చారుట. ఇవాళ ఉదయమే జాయినయినాట్ట అంటూ వచ్చి అనంతం పక్క సీటులో కూలబడ్డాడు.

"సంక్షేమ పథకాల్లో ఇదో భాగం కాబోలు. ఉద్యోగి చస్తే వారి కుటుంబంలో ఒకళ్ళకి ఉద్యోగం ఇవ్వటం"...అన్నాడు పీటరు టైపుమిషన్ ముందుకు లాక్కుంటూ.

ప్రకాశరావు కిళ్ళీ నములుతూ గుప్పు గుప్పు సిగరెట్ పొగ వొదుల్తూ…“ఎన్నెన్నా చెప్పండి… ఈ పథకాల్లో నాకయితే అర్థంలేదనిపిస్తుంది. నలభై ఏళ్ళు, ముప్పయి ఏళ్ళు గొడ్డు చాకిరీ చేసి రిటైరయిపోతే, ప్రభుత్వం ఇస్తున్నది ముష్టి పెన్షన్. పాతిక ముప్పయి వేలు గ్రాట్యుటి. అదే వాడు చచ్చేడనుకోండి. ఇన్సూరెన్స్, ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ, అప్పులన్నీ మాఫీ, ఇంట్లో ఒకళ్ళకి ఉద్యోగం గదండీ. ఈ సదుపాయలన్నీ ప్రభుత్వానికి నిజాయితీగా సేన చేసి రిటైరయిన వాళ్ళగ్గాడా ఇవ్వచ్చుగా ఉహు…చాలీ చాలని పెన్షన్‌తో అష్ట దరిద్రం అనుభవిస్తూ బతకమని వాళ్ళ ఉద్దేశ్యమేమో? నువుపోతే నీ కుటుంబానికి అదిచేస్తాం ఇది చేస్తాం అంటూ ఎంత పీక్కున్నా ఎవడిక్కావాలి? మనం పోయేక ఏం జరుగుతుందో మనం చూస్తావా! చస్తావా!

అందుకే రిటైరావటం కన్నా బాల్చి తాన్నేయటం లాభం. అసలు జనాభాని తగ్గించటానికి ‘ఇదోప్లాన్?” అన్నారు పీటరు మిషన్ వెనకనించి నా మోహం ప్లాన్, మన అనంతంగారి సంగత్ తీసుకుందాం, సర్వీసులో చేరిన అనంతంగారి సంగతే తీసుకుందాం, సర్వీసులో చేరిన దగ్గర్నించి, ఇవాల్టి వరకు ఎంత నిజాయితీగా, భక్తిగా ప్రభుత్వానికి సేవ చేశారు? ఇంకో నెలరోజుల్లో ఆయన రిటైరైపోతున్నారు గదా? వాళ్ళబ్బాయి డిగ్రీ పాసయ్యి ఉద్యోగం లేక తిరుగుతున్నాడు. అతనికి అప్పాయింట్‌మెంట్ ఇవ్వచ్చుగదా. అనంతంగారు సంతోషిస్తారుగదా. కావాలంటే పెన్షన్ అక్కర్లేదని రాసిస్తారు. ఊహు..రూల్స్ ఒప్పుకోవంటారు. అదే. సపోజ్ రేపు ఆయన…చనిపోతే..సారీసర్ ఓన్లీ ఫర్ ఆర్గ్యుమెంటు సర్..జరగరానిది జరిగితే ఆ కుర్రాడ్ని పిల్చి మరీ ఉద్యోగం ఇస్తారా ఇవ్వరా..”

ఆ మాటలతో అనంతంగారి ఆలోచనలు కొత్త దారిని కనుక్కున్నాయ్.

అనంతంగారికి నలుగురు పిల్లలు: పెద్దవాడు సోమసుందరం. డిగ్రీ పాసయ్యి ఉద్యోగాల వేటలో ఉన్నాడు. బుద్ధిమంతుడు. ఈ కాలం కుర్రాళ్ళలాగ వెర్రి వెర్రి

వేషాలు వేసే రకం కాదు. పగలంతా లైబ్రరీ చుట్టూ. ఎంప్లాయిమెంటు ఆఫీసు చుట్టూ తిరుగుతాడు. సాయంత్రం దేవాలయానికి వెళ్లి ప్రదక్షిణాలు, ప్రార్థనలు చేస్తుంటాడు. తల్లంటే ప్రాణం. తండ్రంటే భయం. కుటుంబానికి ఏదో చేయాలని ఆవేశపడుతుంటాడు.

రెండో వాడు నారాయణబాబు. చదువుకన్నా ఆటలన్నా, సినిమాలన్నా ఆసక్తి ఎక్కువ. ఒక్క క్షణం ఇంటిపట్టున ఉండడు. ఆకలేసినపుడు మాత్రమే ఇల్లు గుర్తుకొస్తుంది. ఇహ మూడూ నాలుగూ ఆడపిల్లలు. పెద్దపిల్ల ఇంటర్ చదువుతోంది. పెద్ద మనిషి అయ్యి రెండేళ్ళు కావస్తోంది. మూడోది ఎనిమిదో తరగతి వెగబెడుతోంది. అనంతంగారికి పెళ్ళి చేసుకునే సరికి ముప్పయి ఎడేళ్ళు నిండినాయి. తమ్ముడి చదువూ, చెల్లెలు పెళ్ళి ఆయ్యేదాకా పెళ్లి చేసుకోనని భీష్మించుకూర్చోటం వల్ల ఆలస్యమయింది. ఫలితంగా తాను రిటైరైపోతున్నా ఇంకా బాధ్యతలు అలాగే ఉండిపోయినాయి.

ఆ రోజు ఆఫీసులో ప్రకాశరావు అన్న మాటలు ఆయనకి మళ్ళీ మళ్ళీ చెవుల్లో వినిపిస్తున్నాయ్. అతడు చెప్పినవి కొత్త విషయాలు, తనకి తెలీని విషయాలు కాకపోయినా, అదేమిటో తన ఆలోచనల్లో కొత్త బోదన మొదలయింది.

ఆ రాత్రి అంతా నిద్రపోయాక ఆయన కాగితం కలం తీసుకుని లెక్కలు వేయనారంభించాడు. రిటైరయితే వచ్చి వొరిగేదేంత? వెయ్యిలోపు పెన్షన్, ముప్పయి రెండు వేలు క్యాష్…అదే..ప్రకాశరావు అన్నట్టు…తను గతిస్తేనో…అన్నపూర్ణకి నెల నెలా పెన్షన్, నలభైవేలు ఇన్సూరెన్స్, ముప్పయిరెండువేలు గ్రాట్యుటీ అన్నిటికన్నాముఖ్యం సోమసుందరానికి ఉద్యోగం!

పెద్దవాడి నీతినియమాల పట్ల ఆప్యాయతలపట్లా, నైతిక విలువల పట్లా తనకెంతో గౌరవం, నమ్మకం ఉన్నాయి. వాడికి ఉద్యోగం వస్తే తల్లికి ఏలోటూ రానీకుండా చూస్తూ,. కుటుంబాన్ని పైకి తీసుకొస్తాడు. ఆ నమ్మకం తనకుంది. తనకొచ్చే పెన్షన్ అన్నపూర్ణ జాగ్రత్తచేస్తుంది. తనకీ పిల్లలికి కావాల్సినవి అమర్చుకుంటుంది. తానుపోతే, రెండోవాడిలో మార్పువచ్చి బుద్ధిగా చదువుకుని అన్నగారికి సహకరిస్తాడు. తండ్రిలేని పిల్లలని జాలిపడి ఆడ పిల్లలకి కట్నాలు కూడా ఎక్కువగా అడగరు. సమస్యలన్నీ ఇట్టే పరిష్కారం అయిపోతాయి.

అదే…తను మూర్ఖంగా జీవిస్తే వచ్చే పెన్షన్లో కుటుంబాన్ని పోషించలేక, పిల్లల పెళ్లి చేయలేక, తాను అవస్థపడి, తన వాళ్ళందర్ని అవస్థపెట్టి, రోగంతో మంచం పట్టి నలుగురూ విసుక్కుని హీనంగా, దీనంగా బ్రతికి చివరికి చావాల్సిందే? ఆ చావు ఇప్పుడే చస్తే ఏం?

ఆలోచించిన కొద్దీ తను బ్రతకటంలోని ఆవశ్యకతకన్నా చావులోనే ఎక్కువగా ఉన్నట్టు ఆయనకి అనిపించసాగింది. భార్య, పిల్లలూ అంతా ముందు వరసగా నిల్చుని 'దయచేసి చచ్చిపోయి మాకు సహాయం చేయి నాన్న' అని అడుగుతున్నట్టుగా అనిపించింది.

ఆ నిశ్శబ్దపు చీకటి రాత్రిలో అనంతంగారు గడియారం మూడు గంటలు కొట్టేదాకా తీవ్రంగా, భౌతికంగా, ఆధ్యాత్మికంగా, నైతికంగా, తండ్రిలాగా, భర్తలాగా, మనిషిలాగా, ఆలోచించి.. ఆలోచించి, ఒక స్థిర నిర్ణయానికొచ్చి మంచంపై వాలేరు..తన నిర్ణయాన్ని ఎలా అమలుపర్చాలాని ఆలోచిస్తూనే నిద్రలోకి జారిపోయేరు.

ఆ మర్నాటి నించి ఆయన మాటల్లో, చేతల్లో, చూపుల్లో ఎంతో మార్పొచ్చేసింది. పెద్దవాడు సోమసుందరాన్ని పిల్చి తన ఆఫీసులో ఎవర్నినమ్మొచ్చో, ఎవర్ని నమ్మకూడదో చెప్పసాగేరు. ఆయన ధోరణి అతడికి అర్థంకాక నోరు వెళ్ళబెట్టి విని తర్వాత తల్లికి చెప్పాడు. రెండో కొడుకుని పిల్చి బుద్ధిగా చదూకోమని, అన్నకి సాయంగా ఉండమని చెప్పారు. ఆడపిల్లలకి జెప్పాల్సినవి వాళ్ళకి చెప్పారు. ఎన్నడూ లేనిది ఆసాయంత్రం ఆఫీసు నుంచిరాగానే భార్యతో" అలా బజారెళ్ళి తిరిగొద్దాం వస్తావా' అనడిగారు.

అన్నపూర్ణకి భర్తని చూస్తుంటే, పిల్లలు చెప్పిన సంగతులు వింటుంటే భయం కలగసాగింది. ఎందువల్ల ఆయనలో ఈ మార్పువచ్చిందో ఆవిడకి అర్థంకాలేదు.

భార్యని తీసుకుని బజార్లోకి రాగానే 'రిక్షా ఎక్కుదామా' అనడిగి సమాధానం కోసం ఆగకుండానే, రిక్షాని పిల్చి ఎక్కున్నారు. రిక్షావాడిని టాపువేయమన్నారు. దారిలో హఠాత్తుగా పెళ్ళయిన కుర్రవాడిలాగా ఆదుర్దా ఆత్రం ఆవేశం...

'ఏవండీ..మీలో ఏదో మార్పొచ్చింది. స్పష్టంగా నాకు, పిల్లలకి కనిపిస్తోంది...కారణం ఏమిటి? చెప్పరా? ఇన్నేళ్ళల్లో నేనప్పుడయినా మిమ్మల్ని ఇలా అడిగేనా? కాని మిమ్మల్ని చూస్తుంటే నాకేమిటో భయంగా ఉందండీ..చెప్పండి..చెప్పండి..

'ఏం లేదు అన్నపూర్ణా,. అస్సలేం లేదు..అన్నట్లు..బజార్లో మామిడి కాయలొస్తున్నాయి. వూరగాయాలు పడేయరాదూ. చుట్టాలూ వాళ్ళువస్తే పనికొస్తుంది...ఇన్సూరెన్స్‌పాలసీ బీరువాలో ఉంది. బ్యాంకులో డబ్బు డ్రా చేసి నీపట్టుచీర మడతలో ఉంచా..చూసుకో..రిక్షా ఆపవోయ్..హోటల్లో టిఫిన్ తిని కాఫీ తాగుదాం. ఇవాళ నీకు పూలు గాజులు కొనివ్వాలని ఉందోయ్..."

ఆయన వాలకం, తీరు చూస్తుంటే అన్నపూర్ణకి దిగులు, బాధ, ఆలోచన్లు అధికం కాసాగయ్. రహస్యంగా కొడుకుతో మొరపెట్టుకుంది. తండ్రిని ఏ డాక్టరు దగ్గరకయినా తీసుకెళ్ళమని ప్రధేయపడింది. కాని సోమసుందరం వేరే విధంగా ఆలోచించి కంగారుపడకమ్మా. ఇంకో పది రోజుల్లో రిటైరవుతున్నానన్న నిజంతో నాన్నగారు రాజీపడలేక సైకలాజికల్‌గా బాధపడుతున్నారు. అంతే! క్రమక్రమంగా సమాధానపడి దోవకొస్తారు. అనవసరంగా కంగారుపడక" అంటూ ధైర్యం చెప్పాడు. కాని ఆవిడలో ఆత్రం, ఆవేదన, దిగులూ పెరుగుతున్నాయేగాని తగ్గటంలేదు.

చిత్రంగా రోజులు గడుస్తున్నాయ్. యథావిధిన అనంతంగారు పెట్టుకున్న ముహుర్తపు రోజు రానేవచ్చింది. గడచిన కొద్ది రోజుల్లో అనంతంగారి రూపులో ఎంతో మార్పొచ్చేసింది. మొహం పీక్కుపోయింది. కళ్ళక్రింద నల్లటి చారలు. గడ్డం బాగా మాసింది. నూనె రాయకపోవటంతో జుట్టు పీచు పీచులుగా ఎగిరెగిరి పడుతోంది. పరధ్యానం, ప్రతి వాళ్ళనీ చూసి కళ్ళనీళ్ళు తెచ్చుకోవటం, వస్తువుల వంక పరిసారాల వంక ఆప్యాయంగా అదేపనిగా తీక్షణంగా చూడటం...

భర్త పరిస్థితి చూస్తుంటే అన్నపూర్ణకి అన్నం సహించటంలేదు. ఏ పనీ చెయబుద్ధికావటం లేదు. అలాగే దిగాలుగా కూర్చుండిపోతోంది. పిల్లలే తలో పనీ చేస్తున్నారు. ఆ రోజు తెల్లవారు జామున వులిక్కి పడి లేచి తన పక్కలో ఉన్న భర్తని చూసి ఆశ్చర్యపోయి, ఆయనను తట్టి లేపుతూ, ఇదేమిటండీ...పిల్లలు చూస్తే...అసహ్యంగా వెళ్ళి, మీపక్కమీద పడుకోండి..మిమ్మల్నే..భార్య మాటలతో ఇహ తప్పదనట్లు 'పీడకల వస్తే భయంవేసి' సన్నగా గొణుక్కుంటూ లేచి వెళ్ళారు.

స్నానానికి వెళ్ళే ముందు ఆవిడే స్వయంగా రేజరూ, బ్రష్, క్రీమూ తెచ్చి అక్కడపెట్టి, 'ముందు షేవ్ చేసుకోండి..అలా చూడాలంటే నాకేమిటో దిగులుగా వుంది' అన్నది.

'ఎందుకు పూర్ణా' దండగ అన్నరేగాని భార్య పట్టుదల ముందు తలవంచక తప్పలేదు. తర్వాత తనే స్వయంగా ఆయన్నికూర్చోపెట్టి తలకి నూనె రాసింది. ఉతికి ఇస్త్రీచేసిన ప్యాంటూ షర్టు సిద్ధంగా ఉంచింది. భార్య మాటల్ని ఏదీ ఆరోజు కాదనలేక పోతున్నారు. గట్టిగా పలకరిస్తే లోపల దాచుకున్న దుఃఖం బయటపడుతుందేమోన్న భయం కూడా లేకపోలేదు.

అనంతంగారు అన్ని పన్లూ పూర్తి చేసుకుని ఆఫీసుకి బయల్దేరారు. ఇహా తిరిగిరానని ఆయనకి తెల్సు. మొత్తం కార్యక్రమాన్ని రూపొందించుకుని సిద్దంగా ఉన్నారు.

భవిష్యత్తుని తెల్సుకోవాలని మనిషి తాపత్రయ పడతాడేకాని, అదిగాని తెల్సుకోగలిగితే రాబోయే కష్టాల్ని, సంభవించబోయే విషాదాల్ని తల్చుకుని భయంతో, దిగులుతో వర్తమానాన్ని నిర్వీర్యంగా నిస్తేజంగా గడిపివేసి జీవితాన్ని ఓ విషాద గీతంగా మార్చుకుంటాడు అడ్డు తెరలాంటి మాయ ఎంతో అవసరం.

ఇంకా కొద్ది నిమిషాల్లో తాను చనిపోతున్ననన్న ఆలోచన అనంతంగారిని మానసికంగా అప్పుడే చంపేసింది. ఆయనిప్పుడు కదుల్తున్న కట్టె. ఆఫీసుకు బయల్దేరి తీరా గుమ్మందాటబోతూ ఒక్కక్షణం ఆగి వెనక్కి తిరిగి భార్యవంక ఆఖరుసారిగా ఆప్యాయంగా చూసుకున్నారు. తనకి వయసులో ఉన్నపుడు పురుష సుఖాన్ని, కష్టంలో ధైర్యాన్ని, సుఖంలో ఉత్సాహాన్నిఇన్నేళ్ళు తాను బతకటానికి కారణాన్ని, ఉత్తేజాన్ని ప్రసాదించిన ఈ దేవతని నేచూడలేను. కానీ పూర్ణా! నీ సుఖం కోసం, పిల్లల అభివృద్ధి కోసమే నేనీనిర్ణయం తీసుకున్నది... నన్ను క్షమించు ... క్షమించు.

అనంతంగారు ఆలోచనల్లోంచి తెప్పరిల్లేసరికి, తన కళ్ళ ఎదుట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయ్. తన ఇచేతిని పట్టుకుని తన భార్య ఏడవ్వడం చూసి ఆయన కంగారుపడ్డారు. కళ్ళు తుడుచుకున్నారు. 'ఛ... తను ధైర్యంగా, బింకంగా ఉండాలి.

ఆఖరిక్షణలో తన పథకాన్ని పాడుచేసుకుని భార్య సుఖాన్ని, పిల్లల భవిష్యత్తుని నాశనం చేయకూడదు'.

ఆయన కళ్ళు తుడుచుకుని వెళ్లబోతూ 'వెడుతున్నా పూర్ణా' వెడుతున్నా. ఆరోగ్యం జాగ్రత్త. పిల్లలు జాగ్రత్త. ఎవర్ని నమ్మకు. నీకు ఏది మంచనిపిస్తే అది చెయ్యి... వెడుతున్నా..' ఆయన మాటల్ని మధ్యలోనే ఆపేస్తూ' మీరివ్వాళ్ళ ఎక్కడికీ వెళ్ళొద్దండీ, ఆఫీసుకి సెలవు పడేసి నాతో ఉండి పోండి. నా మాట విన్నండి.. బతమాలసాగింది.

'వెళ్ళాలి పూర్ణా! వెళ్లిపోవాలి. వెళ్ళక తప్పదు. టైంకూడా అయిపోయింది..' ఆమె చేతిని విధిలించుకుని మళ్ళీ వెనక్కి చూడకుండా వీధిలోకి వచ్చేరు.

వీధి బాగా రద్దీగా ఉంది. కార్లు, రిక్షాలూ, స్కూటర్లు, ఆవులు, గేదెలు, పిల్లలు... అందరికన్నా ముందుగా వెళ్లాలన్న తొందర, కంగారు, ఆత్రం ప్రతివారిలో స్పష్టంగా కన్పిస్తోంది.

కాని నిజానికి అనంతంగారు అందరికన్నా తొందరగా, వేగంగా వెళ్ళాలి. కారణం– ఆయన తలపెట్టి, చచ్చిపోవాలనుకున్న రైలు రావటానికి ఇంకా పది నిముషాలే వ్యవధి ఉంది. వీధిలో వెళుతున్న మిగతావారందరికన్నా ఆయనది అతి ముఖ్యమైన వాయిదా వేసుకోలేని పని. అంచేతనే కాబోలు ఆయన దాదాపు పరిగెడుతున్నట్లుగా నడుస్తున్నారు. జనాన్ని తోసుకుంటూ తొక్కుకుంటూ తప్పుకుంటూ రైలు పట్టాలు ఇంకా పది గజాల్లో కనిపిస్తున్నాయ్. ఆ పట్టాల వెంబడి ఇంకో పదిగజాలు నడిస్తే పెద్ద ఖాళీ స్థలం... చెట్లు, చేమలు... రైలు అక్కడ ఆకస్మాత్తుగా మలుపు తిరుగుతుంది. ఇప్పటికే అక్కడచాలా మంది ప్రమాదవశాత్తు చనిపోయేరు. పగలూ రాత్రి అక్కడ కాపలాకి గార్డుని వేయమని అర్జీలు పెట్టుకోవడం ప్రభువులు పట్టించుకోకోవడం జరుగుతూనే ఉంది.

అంతలో ఎవరో వెనకనించి చప్పట్లు కొట్టి పిలుస్తున్నారు. అనంతంగారు విన్నారు. కాని ఆగకుండానే, వెనక్కి తిరిగి చూసేరు. చూపు మందగించిన కళ్లకి ఆకారం స్పష్టంగా కనిపించలేదు. కాని ఎవరో తనవైపుగానే పరిగెత్తుకొస్తున్నారు.

అనంతంగారు తప్పక ఆగేరు. దూరంగా రైలు కూత వినిపిస్తోంది.

పరిగెత్తుకొస్తున్న ఆకారాన్ని పోల్చుకోగలిగినంత దగ్గరగా వచ్చేక, అతడ్ని తన కుమారుడు సోమసుందరంగా గుర్తించి నివ్వెరపోయారు. తన ఉద్దేశ్యం కనిపెట్టేసాడా? తన పథకం పాడయిపోయినట్టేనా. కాని సోమసుందరం వీటన్నిటినీ అతీతమైన స్థితిలో, ఆందోళన, కంగారు, బాధ, దుఃఖం, పూర్తిగా నింపుకున్నట్లు రొప్పుకుంటూ వచ్చి "నాన్నగారూ!' అమ్మ... అమ్మకి గుండెపోటు.. త్వరగా" ఇంకేం మాట్లాడకుండా తండ్రి చేతిని పుచ్చుకుని ఎలా వచ్చేడో అలా, ఉద్వేగంతో వెనక్కి పరుగు ప్రారంభించేడు.

* * *

మనిషిని బతికించేది బతకాలనిపించేలా చేసేది ప్రేమ. అతడ్ని దృఢనిశ్చయంతో ముందుకు నడిపించేది ధైర్యం. అనంతంగారికి ధైర్యం లేకపోవటం చేత ఇన్నేళ్ళ జీవితంలో చాలాసార్లు కాలం చేసి, తిరిగి ప్రేమవల్ల సజీవులయ్యారు. కాని ఇపుడా అవకాశం ఆయనకి లేకుండా పోయింది. ఆయన జీవితంలోని ఏకైక చిరుదీపం ఆరిపోయింది.

ఆయన ఇంటికి చేరేసరికే పూర్ణ చనిపోయింది.

తను ఎవరికోసం బతకాలో, కనీసం ఎవరికోసం చావాలో తెలీని స్థితి, ఆయన క్షోభ...అనంతం.